నేటి నుంచి ఢిల్లీకి విమాన సర్వీసు

ప్రజాశక్తి - కోరుకొండ

మధురపూడి విమానాశ్రయం నుంచి మొదటి సారిగా దేశ రాజధాని ఢిల్లీకి ఎయిర్ బస్ సేవలు గురువారం నుంచి అందుబాటులోకి రానున్నాయి. గురువారం ఉదయం 6:30గం లకు ఢిల్లీ నుంచి బయలుదేరి ఉదయం 8:45గంటలకు మధురపూడి విమానాశ్రయానికి ఎయిర్ బస్సు ప్రయాణిస్తుందని విమానాశ్రయం డైరెక్టర్ ఎస్.జ్ఞానేశ్వరరావు తెలిపారు. అందులో ప్రయాణికులకు ఘనంగా స్వాగతం పలుకుతామని తెలిపారు. ఎయిర్‌బస్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజారపు రామ్మోహన్ నాయుడు, రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి, కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్, తూర్పు గోదావరి జిల్లాకు చెందిన పలువురు ఎంఎల్‌ఎలు పాల్గొంటారని తెలిపారు.

ఎట్టకేలకు ఎన్నికలు

- 14న సాగునీటి సంఘాలకు,
- 17న డిస్ట్రిబ్యూషన్ కమిటీలకు
- తాజాగా నోటిఫికేషన్ విడుదల

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

వాయిదా పెడుతూ వస్తున్న సాగునీటి సహకార సంఘాల ఎన్నికలను ఎట్టకేలకు కూటమి ప్రభుత్వం జరిపిస్తోంది. ఈనెల 14న వీటికి ఎన్నికలు నిర్వహించేందుకు సిద్ధ పడింది. 2014లో టిడిపి ప్రభుత్వ హయాంలో ఈ రెండు సంఘాలకు ఎన్నికలు జరిగాయి. తరువాత అధికారంలోకి వచ్చిన వైసిపి ప్రభుత్వం ఈ సంఘాలను పూర్తిగా విస్మరించింది. వాస్తవానికి ఎన్నికలు జరపాలని చూసినా రెండు సార్లు వాయిదా పడుతూ వచ్చాయి.

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 401 నీటి సంఘాలు ఉన్నాయి. గోదావరి డెల్టా సిస్టం (మేజర్) కింద 144, ఏలేరు ప్రాజెక్టు (మేజర్) కింద 25, తొర్రిగెడ్డ ఎత్తిపోతల పథకం (మీడియం) కింద 4, పంపా జలాశయం (మీడియం) కింద 6, సుబ్బారెడ్డి సాగర్ ప్రాజెక్టు (మీడియం) కింద ఆరు, మైనర్ ఇరిగేషన్ ప్రాజెక్ట్స్ కింద 216 నీటి సంఘాలు ఉన్నాయి. వీటి పరిధిలో డిస్ట్రిబ్యూటరీ కమిటీలు 30, ప్రాజెక్టు కమిటీలు ఐదు ఏర్పాటు చేశారు. వీటన్నింటికీ ఎన్నికలు జరుగనున్నాయి.

నోటిఫికేషన్ విడుదల

ఈనెల 11న నోటిఫికేషన్ విడుదల చేశారు. 14న సాగినీటి సంఘాల ఎన్నికలు జరుగుతాయి. ఎన్నికలు జరిగే ప్రాంతాల్లో ఆయా తహశీల్దార్, ఎంపిడిఒ, నీటిపారుదల శాఖ అధికారి, రెవెన్యూ డివిజనల్ అధికారి కార్యాలయాల వద్ద నోటీసు బోర్డుల్లో నోటిఫికేషన్‌ను ప్రకటించారు. ప్రభుత్వ నిర్ణయం ప్రకారం సాగునీటి సంఘాలకు రెండు అంచెల్లో ఎన్నికలు జరుగుతాయి. 14న సాగునీటి సంఘాల అధ్యక్షులు, ఉపాధ్యక్షులను, డిసెంబర్ 17న డిస్ట్రిబ్యూషన్ కమిటీకు ఎన్నికలు జరుగుతాయి. చిన్న నీటి పారుదలకు సంబంధించి ఒక్కొక్క సంఘంలో ఆరుగురు సభ్యులు, మధ్యతరహాకు సంబంధించి ఒక్కొక్క సంఘంలో 12 మంది సభ్యులు ఉంటారు.

పదేళ్ల తర్వాత

సాగునీటి సంఘాల బలోపేతానికి 2014లో టిడిపి ప్రభుత్వం ఎన్నికలు నిర్వహించింది. సాగునీటి వనరులకు ఇబ్బందులు లేకుండా ఉన్నాయి. ఖరీఫ్, రబీ సీజన్లలో కాలువల్లో గుర్రపు డెక్క, పూడిక తీత వంటి పనులు చేపట్టేవారు. వర్షా కాలంలో చెరువులు, కాలువలకు గండ్లు పడకుండా చూసేవారు. ఒకవేళ గండ్లు పడినా తక్షణం పూడ్చి వేసేలా సాగునీటి సంఘాలు చర్యలు తీసుకునేవి. అయితే 2019 తర్వాత వైసిపి ప్రభుత్వం సాగునీటి సంఘాలను పూర్తిగా విస్మరించింది. రెండు మూడుసార్లు ఎన్నికలు నిర్వహించాలని చూసినప్పటికీ అంతగా శ్రద్ధ కనబరచలేదు. 2020 ఆగస్టులో సాగునీటి సంఘాలను రద్దు చేసింది. సంఘాల చైర్మన్ల స్థానంలో డిఇఇలను ఇన్‌ఛార్జిలుగా నియమించింది. దీంతో సాగునీటి సంఘాలు పూర్తిగా నిస్తేజంగా మారడంతో ఆ వ్యవస్థపై పర్యవేక్షణ కరువైందనే ఆరోపణలు పెద్ద ఎత్తున వెలువెత్తాయి. ఫలితంగా వర్షాల సమయంలో జిల్లాలో పలు చెరువులు, సాగునీటికి కాలువలకు గండ్లు పడ్డాయి. కాలువల్లో పూడికతీత పనులు చేపట్టకపోవడంతో పొలాలకు సాగునీరు అందని పరిస్థితి దాపురించిందని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తూ వచ్చారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం సాగునీటి సంఘాల ఎన్నికలకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో తమ సమస్యలు పరిష్కారం అవుతాయని రైతులంతా ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

మూడు సార్లు వాయిదా

తొలుత అక్టోబర్ 16న నిర్వహించాలని భావించారు. వివిధ కారణాలతో అప్పట్లో వాయిదా వేశారు. స్వయాన ఆ శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ప్రకటించినప్పటికీ ఎన్నికలు జరపలేదు. ఆ తర్వాత అదే నెల 21న నిర్వహించాలని భావించి నోటిఫికేషన్ కూడా విడుదల చేశారు. 21 నుంచి 31 మధ్యలో ప్రాదేశిక నియోజకవర్గాలను ఖరారు చేస్తారని తెలిపారు. మరోసారి నవంబర్ 21న ఎన్నిక ఉంటుందని ప్రకటించారు. కానీ మరోసారి వాయిదా పడింది. చివరకు ఈనెల 14న ఎట్టకేలకు ఎన్నికల నిర్వహణకు కూటమి ప్రభుత్వం సిద్ధపడింది.

రైతుల సమస్యలు గాలికి

నీటిపారుదల వ్యవస్థ పర్యవేక్షణలో సాగునీటి సంఘాలు కీలకంగా వ్యవహరించేవి. చెరువులు, కాలువల్లో పూడికతీత, తూముల నిర్మాణం, ఆధునీకరణ పనులు, పొలాలు ముంపునకు గురికాకుండా చూడడం వంటివి ఈ సంఘాలు చేసేవి. రూ.5 లక్షల్లోపు పనులను సంఘాలే నామినేషన్ పద్ధతిలో చేయించేవి. పదేళ్లుగా నీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించకపోవడంతో చిన్న సమస్యల పరిష్కారానికి సైతం అధికారులపైనే ఆధారపడాల్సి వచ్చింది. ఇరిగేషన్ శాఖాధికారులకు బాధ్యతలు అప్పగించడంతో ప్రతి పనికి వారే అంచనాలు రూపొందించి టెండర్లు పిలిచేవారు. దీనివల్ల పనుల్లో తీవ్ర జాప్యం చోటు చేసుకుంటోంది. సాగునీటి సంఘాలు లేకపోవడం వల్ల పంటకాలువలను పట్టించుకునే నాధుడే కరువయ్యాడు. పంటకాలువలు పూడుకు పోవడంతో శివారు భూములకు ఏటా సాగునీటి కొరత తప్పట్లేదు. వర్షాలు వస్తే బోదెలు పూడుకు పోవడంతో నీరు దిగక పంటలను కోల్పోవాల్సిన పరిస్థితి. ప్రస్తుతం నీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించడంతో రైతుల్లో హర్షం వ్యక్తం అవుతుంది.

విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శన

నన్నయలో యువ ఉత్సవ్

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

ప్రజాశక్తి - రాజానగరం

ఆదికవి నన్నయ యూనివర్సిటీలో గురువారం జిల్లా స్థాయి 'యువ ఉత్సవ్' కార్యాక్రమం ఉత్సాహంగా సాగింది. భారత ప్రభుత్వం యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ, నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. విసి వై.శ్రీనివాసరావు, రిజిస్ట్రార్ జి.సుధాకర్, నెహ్రూ యువ కేంద్ర జిల్లా యువ అధికారి దూలం కిషోర్ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా విసి శ్రీనివాసరావు మాట్లాడారు. నేటి ఆధునిక ప్రపంచంలో యువత సెల్ ఫోన్‌తో ఎక్కువ సమయం గడుపుతుందన్నారు. దానికి భిన్నంగా సాంస్కృతిక కార్యక్రమాలపై దృష్టి సారిస్తే ఆరోగ్యంతో పాటూ ఆనందం కలుగుతుందన్నారు. కమ్యూనికేషన్ స్కిల్స్ మెరుగుపడతాయని తెలిపారు. యువ ఉత్సవ్ లాంటి కార్యక్రమాలు నేటి యువతరానికి స్ఫూర్తిగా నిలుస్తాయన్నారు. వారిలోని ప్రతిభా పాటవాలను వెలికి తీసేందుకు, దేశభక్తిని పెంపొందించేందుకు ఉపయోగపడతాయన్నారు. రిజిస్ట్రార్ జి.సుధాకర్ మాట్లాడుతూ 2047 నాటికి దేశం ప్రపంచానికి దిక్సూచీలా ఉండాలన్నారు. అందుకు ఇలాంటి కార్యక్రమాలు మరింత దోహదపడతాయన్నారు. నెహ్రూ యువ కేంద్రం జిల్లా అధికారి దూలం కిషోర్ మాట్లాడుతూ సైన్స్ మేళా ఎగ్జిబిషన్ గ్రూప్, సోలో, పెయింటింగ్, పద్యాలు రాయడం, ఫొటోగ్రఫి, వక్తృత్యం, సాంస్కతిక కార్యక్రమాలకు పోటీలు నిర్వహించామని తెలిపారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంతో పాటు అనుబంధ కళాశాలల నుంచి విద్యార్థులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారని చెప్పారు. ఈ పోటీల్లో విజేతలను రాష్ట్ర స్థాయి, జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేస్తామన్నారు.

జ్యోతి ప్రజ్వలన చేస్తున్న విసి శ్రీనివాసరావు

సాంస్కృతిక రాజధాని రాజమహేంద్రవరంలో నిర్వహించిన ఈ పోటీల్లో యువతీ యువకులు అత్యద్భుత ప్రతిభను ప్రదర్శించి జాతీయ స్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థుల సాంస్కతిక ప్రదర్శనలు, ఎగ్జిబిషన్స్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. అనంతరం పోటీల్లో విజేతలకు నగదు బహుమతులు అందించారు.

తరగతి గదిని పరిశీలిస్తున్న డిఇఒ

ఉత్తీర్ణతా శాతం పెంచాలి

ప్రజాశక్తి - గోపాలపురం

చదువులో వెనకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుని ఉత్తీర్ణతా శాతం పెంచాలని జిల్లా విద్యాశాఖ అధికారి కె.వాసుదేవరావు ఉపాధ్యాయులకు సూచించారు. బుధవారం మండలంలోని కొవ్వూరుపాడు హైస్కూల్, కరగపాడు యుపి స్కూల్‌ను ఆయన తనిఖీ చేశారు. పాఠశాలలో తరగతి గదులకు వెళ్లి విద్యార్థులతో మాటాడారు. చదువులో వారి సామర్థ్యాలను పరీక్షించారు. డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం నాణ్యతను పరిశీలించారు. విద్యార్థులకు పాఠశాలలో నిర్వహిస్తున్న పరీక్షలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు అందించే భోజనం మెనూ ప్రకారం నాణ్యతా ప్రమాణాలతో రుచిగా సూచికగా అందించాలన్నారు. భోజనం రుచిలో నాణ్యతలో రాజీ పడితే సహించేది లేదన్నారు. విద్యార్థులు తప్పనిసరిగా షూలు, యూనిఫామ్‌లతో పాఠశాలకు వచ్చేలా చూడాలన్నారు. గతేడాది కంటే ఉత్తమ ఫలితాలు సాధించేందుకు ప్రణాళికలు రూపొందించాలని తెలిపారు. ఆయన వెంట ఎంఇఒ2 ఎ.మహేశ్వరావు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ఉన్నారు.

పొగాకు తోటల పరిశీలన

ప్రజాశక్తి - గోపాలపురం

మండలంలోని వాదాలకుంటలో వర్జీనియా పొగాకు తోటలను సిటిఆర్ఐ శాస్త్రవేత్త డాక్టర్ హెచ్‌ఆర్.మహేష్ బుధవారం పరిశీలించారు. ఈ తోటలకు మానుకుళ్లు, సీతాఫలం తెగుళ్లు సోకాయని తెలిపారు. ఆయన మాట్లాడుతూ వాతావరణం అనుకూలంగా లేని కారణంగా పొగాకు తోటలకు తెగుళ్లు సోకుతున్నాయన్నారు. ప్రతి రైతు తప్పనిసరిగా 'పంట మార్పిడి విధానం చేపట్టాలన్నారు. తద్వారా తెగుళ్ల నివారణ సాధ్యమవుతుందన్నారు. భూమిలో సారం తగ్గినా తెగుళ్లు వస్తుంటాయన్నారు. సిటిఆర్ఐలో తెగుళ్ల నివారణకు పరిశోధనలు జరుగుతున్నాయన్నారు. ఎక్కువ శాతం తెగుళ్లు సోకిన తోటల స్థానంలో దుక్కి దున్ని మరలా పొగాకు నాట్లు వేయాలని ఆయన రైతులకు సూచించారు. ఆయన వెంట గోపాలపురం పొగాకు వేలం నిర్వాహ్మణాధికారి ఆమూల్ డి.శ్యామ్, రైతు సంఘం అధ్యక్షుడు ఇల్లూరి రాంబాబు, ఉపాధ్యక్షుడు దుగ్గిరాల రాంబాబు, వాదాలకుంట పొగాకు రైతులు ఉన్నారు.

పొగాకు పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

'మోహన్‌బాబుపై చర్యలు తీసుకోవాలి'

ప్రజాశక్తి- కడియం

జర్నలిస్టులపై దాడి చేసిన సినీ నటుడు మంచు మోహన్‌బాబుపై కఠిన చర్యలు తీసుకోవాలని కడియంలో జర్నలిస్టులు సిఐ ఎ.వెంకటేశ్వరరావుకు బుధవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా జర్నలిస్టులు మాట్లాడుతూ విధులు నిర్వహిస్తున్న విలేకరులను అడ్డుకోవడం మంచి పద్ధతి కాదన్నారు. జర్నలిస్ట్‌పై దాడికి పాల్పడ్డ సినీ నటుడు మోహన్‌బాబు బహిరంగ క్షమాపణ కోరాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో చెల్లుబోయిన శ్రీనివాస్, అన్నందేవుల సూర్యచంద్రరావు, పల్ల వెంకటగిరి, యండమూరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

13, 14న విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి - చాగల్లు

చాగల్లులో 33/11కెవి సబ్ స్టేషన్‌లో మరమ్మతుల నిమిత్తం 13, 14 తేదీల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుదని విద్యుత్ శాఖ అధికారి ఎస్.త్రిమూర్తులు తెలిపారు. ఆయా రోజుల్లో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. ఈ సబ్ స్టేషను పరిదిలో ఉన్న అన్ని 11 కెవి ఫీడర్స్‌కి విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు. దీని వల్ల చాగల్లు, నేలటూరు, మీనా నగరం గ్రామలకు, లిఫ్ట్ ఇరిగేషన్ స్కీం, నేలటూరు ఎజిఎల్ ఫీడర్, అమ్మిగుంట ఫీడర్, ఊనగట్ల ఫీడర్లకు విద్యుత్ సరఫరాను నిలిపేస్తామన్నారు. వినియోగదారులు దీనికి సహకరించాలని కోరారు.

ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కు అందజేత

ప్రజాశక్తి - నల్లజర్ల

నల్లజర్ల గ్రామానికి చెందిన అల్లాడ రాజేంద్రవరప్రసాద్‌కు ఇటీవల అనారోగ్యం కలగడంతో వైద్య ఖర్చుల నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ.2,54,276 చెక్కును ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ ముళ్ళపూడి బాపిరాజు గోపాలపురం ఎంఎల్‌ఎ మద్దిపాటి వెంకటరాజు చేతుల మీదుగా బుధవారం అందించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు తాతిన సత్యనారాయణ, ఎంపిటిసి సభ్యులు రావూరి వెంకటరమణ, ఆలపాటి రామకృష్ణ, టిడిపి మండల ఉపాధ్యక్షులు గుదే వెంకటసుబ్బారావు, తెలుగు యువత మండల ఉపాధ్యక్షులు సవలం రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సామాజిక సేవ వెలకట్టలేనిది

ప్రజాశక్తి - పెరవలి

సామాజిక సేవ వెలకట్టలేనిదని కానూరు సర్పంచ్ భావన మధుపూర్ణచంద్ అన్నారు. కానూరుకు చెందిన సామాజిక వేత్త, అమ్మ బ్లడ్ ఆర్గనైజేషన్ వ్యవస్థాపకుడు డాక్టర్ టి.రాము సమకూర్చిన ఫ్రీజర్ వ్యాన్‌ను పంచాయతీకి అందించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడారు. రాము పలు సామాజిక సేవా కార్యక్రమాలు చేస్తూ ప్రజల మన్ననలు పొందారన్నారు కరోనా కష్ట కాలంలో రోగులకు ఉచిత అంబులెన్స్, ఆక్సిజన్ అందించారన్నారు. 1,031 మంది అనాథ శవాలకు అంత్యక్రియలు నిర్వహించారన్నారు. ఆరుగురికి గుండె, 15 మందికి కిడ్నీ ఆపరేషన్లు, 1,200 సార్లు అనాథాశ్రమంలో అన్నదానం, 30 సార్లు రక్తదానం నిర్వహించారన్నారు. పలు సేవాకార్యక్రమాలు నిర్వహిస్తూ గ్రామానికి మంచి పేరు తేవడం అభినందనీయమన్నారు. అనంతరం రామును శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ అనపర్తి నరసింహమూర్తి, అనపర్తి సత్తిపండు నాయకులు బూరుపల్లి రాజు, కోలా సీతయ్య నాయుడు, రంకిరెడ్డి ప్రసాద్, తోట సురేష్, వెన్నపు సుధాకర్, యుటిఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ పెదపోలు వెంకట రాయుడు గ్రామస్తులు పాల్గొన్నారు

ఫ్రీజర్ వ్యాన్‌ను అందిస్తున్న దాత రాము

మాల్‌ను ప్రారంభిస్తున్న సినీ నటి శ్రీలీల

చెన్నయ్ షాపింగ్ మాల్ ప్రారంభం

సందడి చేసిన సినీ నటి శ్రీలీల

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

రాజమహేంద్రవరం ఆర్‌టిసి కాంప్లెక్స్ వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన చెన్నయ్ షాపింగ్ మాల్ బుధవారం ప్రారంభమైంది. సినీ నటి శ్రీలీల దీన్ని ప్రారంభించారు. రాజమహేంద్రరం సిటీ ఎంఎల్‌ఎ ఆదిరెడ్డి శ్రీనివాస్, రూరల్ ఎంఎల్‌ఎ గోరంట్ల బుచ్చయ్యచౌదరి, మాజీ ఎంఎల్‌సి ఆదిరెడ్డి అప్పారావు తదితరులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. నిర్వాహకులు మాట్లాడుతూ రూ.99 నుంచే తమ మాల్‌లో వస్త్రాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. కాంబో ఆఫర్లు ఇస్తున్నామని తెలిపారు. బంగారు ఆభరణాలను అతితక్కువ తరుగు, అలాగే మజూరి లేకుండా చెన్నయ్ షాపింగ్ మాల్ అందిస్తుందని తెలిపారు. బుడ్డిగ శ్రీనివాస్, సూరవరపు శ్రీనివాస్, మన్యం ఫణి, భీమశంకరం, చలుమూరి శ్రీనివాస్, ఇన్నమూరి దీపు, జెఎంవి.పార్థసారథి, పులవర్తి వెంకటేష్, సూరంపూడి శ్రీహరి, చిక్కాల బాబులు, ఇంకా పలువురు వ్యాపారవేత్తలు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు.

నోబెల్ గ్రహీతలు, ఆవిష్కరణలపై పోటీలు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

స్థానిక ఆర్ట్స్ కళాశాల రసాయన శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో నోబెల్ దినోత్సవం సందర్భంగా 'నోబెల్ గ్రహీతలు వారి ఆవిష్కరణలు' అనే అంశంపై పోస్టర్ ప్రజెంటేషన్‌లో పోటీలను గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన రసాయన శాస్త్ర విభాగాధిపతి టి.శ్రీనివాసరావు నోబెల్ దినోత్సవ ప్రాధాన్యతను వివరించారు. నోబెల్ గ్రహీతల ప్రత్యేక లక్షణాలను గుర్తు చేస్తూ విద్యార్థులు కూడా వారిని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. అధ్యాపకులు నరసింహమూర్తి, బేబి నిర్మల, దుర్గ, ప్రవీణ న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు. అనంతరం విజేతలకు బహుమతులు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో రసాయన శాస్త్ర అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై శిక్షణ

ప్రజాశక్తి - చాగల్లు

సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు(ఎల్ఎస్‌డిజిఎస్)పై మండలంలోని మండల స్థాయి అధికారులు, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందికి రెండు బ్యాచ్‌లుగా శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని ఎంపిడిఒ ఆర్.శ్రీదేవి తెలిపారు. 12, 13 తేదీల్లో మొదటి విడత, 17, 18 తేదీల్లో రెండో విడత శిక్షణా కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు.

గౌరీపట్నం పిహెచ్‌సిలో తనిఖీలు

ప్రజాశక్తి -దేవరపల్లి

గౌరీ పట్నం పిహెచ్‌సిలో స్టేట్ టిబి ఆఫీసర్ డాక్టర్ రమేష్ బుధవారం తనిఖీలు చేశారు. గ్రామంలో గల టిబి కేసులు, బాధితులకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. నిక్షయ మిత్ర ద్వారా వ్యాధిగ్రస్తులకు పోషకాహార కిట్లు అందజేశారు. ఆయన మాట్లాడుతూ టీబీ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు, చికిత్స పూర్తిగా ఉచితంగా అందిస్తారన్నారు. పోషకాహార కిట్లు అందజేయడానికి గ్రామస్తులు, దాతలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. టిబి వ్యాధిగ్రస్తులకు చికిత్స పూర్తి అయ్యేవరకు నెలకు రూ.1000 నేరుగా వారి బ్యాంకు ఎకౌంట్లో జమ అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఎన్.వసుంధర, డిఎల్ఎటఒ డాక్టర్ జి.సతీష్, పిహెచ్‌సి వైద్యాధికారి ఆర్.పోతురాజు తదితరులు పాల్గొన్నారు.

కార్టూ'నిజం'



కళ్లాల్లో ధాన్యం పరిశీలన

ప్రజాశక్తి-గోకవరం

మండలంలోని పలు గ్రామాల్లో కళ్లాల్లో ఉన్న వరి పంటను ఇన్‌ఛార్జి జిల్లా వ్యవసాయ అధికారి జయరామలక్ష్మి, జిల్లా పౌర సరఫరాల అధికారి రాధిక బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున రైతులందరూ బరకాలతో కప్పి ఉంచుకోవాలన్నారు. వర్షాలు తగ్గే వరకు కోతల వాయిదా వేసుకోవాలన్నారు. అలాగే రైతులందరూ పంట బీమా చేయించుకోవాలన్నారు. వరి, మొక్కజొన్న నాటిన ప్రతి రైతు ఇన్సూరెన్స్ ప్రీమియం కట్టుకోవాలని తెలిపారు. రబీ ఈ-పంట నమోదు త్వరిత గతిన పూర్తి చేయాలని గ్రామ వ్యవసాయ ఉద్యాన శాఖ సిబ్బందిని ఆదేశించారు. వారి వెంట వ్యవసాయ శాఖ అధికారులు, సివిల్ సప్లయిస్ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

ధాన్యాన్ని పరిశీలిస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు

గృహ నిర్మాణ శాఖ మంత్రిని కలిసిన ఎంఎల్‌ఎ బత్తుల

ప్రజాశక్తి - కోరుకొండ

అమరావతిలోని గృహ నిర్మాణ శాఖ కార్యాలయంలో రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథిని రాజానగరం ఎంఎల్‌ఎ బత్తుల బలరామకృష్ణ బుధవారం కలిశారు. అర్హులైన వారికి గృహ నిర్మాణ రుణాలను మంజూరు చేయాలని కోరారు. గత ప్రభుత్వ హయాంలో లబ్ధిదారులకు సంబంధించిన బకాయిలను విడుదల చేయాలన్నారు. ప్రభుత్వం పేదలకు ఇచ్చిన స్థలాల వద్ద మౌలిక సదుపాయాలు కల్పించాలని, అధిక సంఖ్యలో కొత్త రుణాలు మంజూరు చేయాలన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఇళ్ల స్థలాల పంపిణీలో అవకతవకలు జరిగాయని, అర్హులైన ప్రతీ ఒక్కరికీ ఇంటి పట్టాతో పాటు స్థలం, ఇంటి రుణం ఇచ్చి సొంతింటి కలను నెరవేర్చాలన్నారు. వీటిపై మంత్రి సానుకూలంగా స్పందించారని ఎంఎల్‌ఎ బత్తుల తెలిపారు. త్వరలో నియోజకవర్గంలో పర్యటిస్తానని మంత్రి హామీ ఇచ్చినట్లు బత్తుల తెలిపారు.

నేటి నుంచి రెవెన్యూ సదస్సులు

ప్రజాశక్తి - కోరుకొండ

మండలంలో రెవెన్యూ సదస్సులు గురువారం నుంచి జరుగుతాయని తహశీల్దార్ సుస్వాగతం తెలిపారు. ఈ నెల 12న దోసకాయలపల్లి, 13న కోటి, 16న నరసింహపుర అగ్రహారం, 17న బొల్లెద్దుపాలెం, 18న కోటికేశవరం, 19న రాఘవపురం, 20న శ్రీరంగపట్నం, 21న కోరుకొండ, 23న జంబూపట్నం, 24న నరసాపురం, 27న కణుపూరు, 28న గాదరాడ, 30న బూరుగుపూడి, వచ్చే జనవరి 2న కాపవరం, 4న బుచ్చెంపేట, 6న మధురపూడి, 7న నిడిగట్ల, 8న గాడాల గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు తెలిపారు.

ఉంద్రాజవరం : గురువారం నుంచి మండలంలో రెవెన్యూ సదస్సులు ప్రారంభమవుతాయని తహశీల్దార్ పిఎన్‌డి.ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. 11 నుంచి జనవరి 7వరకూ ఈ సభలు జరుగుతాయన్నారు. వీటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

దేవరపల్లి : మండలంలో గురువారం నుంచి రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామని తహశీల్దార్ కె.రాజ్యలక్ష్మి తెలిపారు. ఈ నెల 28 వరకూ ఈ సదస్సులు జరుగుతాయన్నారు. దీర్ఘకాలంగా ఉన్న భూ సమస్యలను ఈ సదస్సుల ద్వారా పరిష్కరించుకోవచ్చన్నారు. ఆమె వెంట డిప్యూటీ తహశీల్దార్ శ్రీనివాసరావు ఉన్నారు.

నేరాలు ఘోరాలు

400 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం

ప్రజాశక్తి - పెద్దాపురం

ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో బుధవారం నిర్వహించిన దాడుల్లో సారా తయారీకి సిద్ధంగా ఉంచిన 400 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్లు ఎక్సైజ్ సిఐ అర్జునరావు తెలిపారు. సుబ్బయ్యమ్మ పేటలో నిర్వహించిన దాడుల్లో బెల్లపు ఊట ధ్వంసం చేశామని, చంద్రమాంపల్లి గ్రామంలో నిర్వహించిన దాడుల్లో అక్రమంగా మద్యాన్ని అమ్ముతున్న వ్యక్తి నుంచి 7 మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని, అతనిపై కేసు నమోదు చేశామన్నారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ ఎస్ఐ చిట్టిబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ప్రజాశక్తి - రామచంద్రపురం

ద్రాక్షారమం - యానాం మెయిన్ రోడ్డులో బుధవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు గాయపడ్డారు. యానాం వైపు నుంచి వస్తున్న టాక్సీ ద్రాక్షారం వైపు నుంచి వెళుతున్న మోటార్ సైకిల్ ఢీకొన్నాయి. ప్రమాదంలో కోరంగి కి చెందిన ఈత మణిద్వీప్, అతను స్నేహితుడు ఆకాశ్ లు గాయపడ్డారు. వీరిని చికిత్స నిమిత్తం ఆసుపత్రిలో తరలించారు. రోడ్డు ప్రమాదం జరిగిన వెంటనే ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది. ద్రాక్షారామ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

లారీ కిందపడి వ్యక్తి మృతి

ప్రజాశక్తి - చాగల్లు

లారీ కిందపడి వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన చాగల్లులో బుధవారం చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు ఊనగట్లకు చెందిన బుర్రా బాలకృష్ణ తాపీ మేస్త్రీగా జీవనం సాగిస్తున్నాడు. పని నిమిత్తం బైకుపై బుధవారం సాయంత్రం చాగల్లు వెళ్లాడు. జూనియర్ కాలేజీ సమీపానికి వచ్చే సరికి పంగిడి నుంచి నిడదవోలు వైపు వెళ్తున్న లారీ అతన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో బాలకృష్ణ(32) లారీ టైర్ల కిందపడిపోవడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం నిడదవోలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేశామని చాగల్లు పోలీసులు తెలిపారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో జరిమానా

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

రాజమహేంద్రవరం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో 9 మంది నిందితులకు రూ.85వేల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి బుధవారం తీర్పు నిచ్చారు. ఎస్పి ఆదేశాల మేరకు నగరంలో రోడ్డు ప్రమాదాల నివారణలో భాగంగా వాహన తనిఖీలు చేపట్టామని ట్రాఫిక్ డిఎస్పి ఎం.వెంకటేశ్వరరావు తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న 9 మందిని కోర్టులో హాజరు పరచగా 8 మందికి ఒక్కొక్కరికి రూ.10వేలు, మరొక నిందితునికి రూ.5వేలు జరిమానా విధిస్తూ స్పెషల్ జ్యుడీషియల్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ తీర్పునిచ్చారని తెలిపారు.

దగ్ధమవుతున్న బైకు

ఎలక్ట్రికల్ బైక్ దగ్ధం

ప్రజాశక్తి - రాజానగరం

బ్యాటరీ నుంచి మంటలు రావడంతో ఎలక్ట్రికల్ బైక్ దగ్ధమైంది. ఈ ఘటన రాజానగరం మండలం చక్రద్వారబంధంలో బుధవారం జరిగింది. మంటలను సకాలంలో గుర్తించడంతో యజమానికి ప్రాణాపాయం తప్పింది. గ్రామానికి చెందిన చిక్కాల రాఘవ ఏడాది క్రితం ఎలక్ట్రికల్ బైకును కొనుగోలు చేశాడు. బుధవారం సాయంత్రం పొలానికి వెళుతుండగా మోటారు సైకిల్ సీటు కింద ఉన్న బ్యాటరీ నుండి చిన్నగా శబ్దాలు రావడం గమనించాడు. వెంటనే మోటారు సైకిల్‌ను పక్కకు ఆపి సీటు పైకి లేపడంతో ఒక్కసారిగా మంటలు వ్యాపించి వాహనం మెత్తం కాలిబూడిదైయింది.

సుస్మితను అభినందిస్తున్న హెచ్‌ఎం తదితరులు

రాష్ట్ర స్థాయి పోటీలకు సుస్మిత ఎంపిక

ప్రజాశక్తి - బిక్కవోలు

పందలపాక శ్రీ పడాల పెద పుల్లారెడ్డి జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థిని వైరాల సుస్మిత అండర్-19 రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలకు ఎంపికైందని హెచ్‌ఎం చీర్ల శ్రీనివాసరెడ్డి తెలిపారు. శుక్రవారం నుంచి తిరుపతిలో జరిగే రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీల్లో సుస్మిత పాల్గొంటుందని తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ కోనాల సత్తిరాజు, వ్యాయామ ఉపాధ్యాయులు ద్వారంపూడి యువరాజారెడ్డి సుస్మితను అభినందిచారు.

31లోగా పంటల బీమా ప్రీమియం చెల్లించాలి

ప్రజాశక్తి - ఉంగ్రాజవరం

ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజనకు సంబంధించి ప్రీమియం ఈ నెల 31లోగా చెల్లించుకోవాలని ఎఒ ఎం.విశ్వాసరావు తెలిపారు. వరి పంటకు ఎకరాకు రూ.630, హెక్టారుకు రూ.1,575 చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఈ బీమా వల్ల ప్రకృతి విపత్తుల సమయంలో పంటకు నష్టం వాటిల్లితే పరిహారం పొందే వీలుంటుందన్నారు. బీమా మొత్తంపై 1.5 శాతం నష్టపరిహారం పొందే అవకాశం ఉంటుందన్నారు. ఆధార్ కార్డు, బ్యాంకు ఎకౌంటు జిరాక్స్ కాపీలతో మీసేవ, రైతు సేవా కేంద్రం, కామన్ సర్వీస్ సెంటర్లలో చెల్లించొచ్చన్నారు. స్మార్ట్ ఫోన్ ద్వారా చెల్లించేవారు క్రాప్ ఇన్సూరెన్స్ యాప్‌లో ప్రీమియం సొమ్ము చెల్లించ వచ్చన్నారు.

అర్జీలకు సకాలంలో పరిష్కారం చూపాలి : కలెక్టర్

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

అర్జీలను స్వీకరిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

ప్రజల నుంచి స్వీకరించిన అర్జీలకు సకాలంలో పరిష్కారం చూపాలని కలెక్టర్ పి.ప్రశాంతి అధికారులను ఆదేశించారు. సోమవారం రాజమహేంద్రవరం రూరల్‌లోని కలెక్టరేట్‌లో నిర్వహించిన పిజిఆర్ఎస్‌లో ప్రజల నుంచి 178 అర్జీలను స్వీకరించామని ఆమె తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు.ప్రజల నుంచి వివిధ సమస్యలపై స్వీకరించిన అర్జీలను నిర్ణీత కాల వ్యవధిలోనే పరిష్కరించాన్నారు. ప్రజలు అందజేసే అర్జీలలో అత్యధిక శాతం మండల స్థాయిలోనే పరిష్కారం లభిస్తుందన్నారు. అర్జీలను అందజేసేందుకు వ్యయ ప్రయాసలకోర్చి కలెక్టరేట్‌కు రానవసరం లేదని అర్జీదారులకు సూచించారు. జిల్లాలో నిర్వహించే రెవెన్యూ సదస్సులకు సంబంధించిన సమాచారాన్ని స్థానికంగా ఉన్న ప్రజాప్రతినిధులను తెలియజేయాలన్నారు. మండల స్థాయి ప్రత్యేకాధికారులు సమావేశాలకు హాజరుకావాలని ఆదేశించారు. గ్రామస్థాయిలో ఉన్న కార్యాలయాలు పాఠశాలలు, అంగన్‌వాడీ, చివాలయాలను సందర్శించి సమస్యలను అవగాహన చేసుకొని పరిష్కరించే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. ఈ నెల 12తో ఎన్నికల కోడ్ ముగియనున్న దృష్ట్యా, జిల్లాలో చేపట్టిన రహదారులు ఇతర అభివృద్ధి కార్యక్రమాల సమాచారాన్ని ముందుగానే ప్రజా ప్రతినిధులకు తెలియజేసి తప్పనిసరిగా ప్రారంభోత్సవానికి ఆహ్వానించాలన్నారు. త్వరలో నిర్వహించే దిశ సమీక్ష సమావేశానికి సంబంధించి శాఖల వారీగా చేపట్టి అమలు చేస్తున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాల సమాచారాన్ని పూర్తి స్థాయి నివేదికలో సిద్ధం చేయాలన్నారు.

ఈ నెల 14న సాగునీటి సంఘాల ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం షెడ్యూల్‌ను విడుదల చేసిందన్నారు. సాగునీటి సంఘాల ప్రాదేశిక నియోజకవర్గాలకు 14న ఎన్నికలు జరుగుతాయన్నారు. రెవెన్యూ, పంచాయతీరాజ్, ఇరిగేషన్ అధికారులు ఎన్నికల ప్రక్రియకు సంబంధించి సిద్ధంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎస్.చిన్నరాముడు, డిఆర్ఒ డి.సీతారామమూర్తి, సిపిఒ అప్పలకొండ, డిఎల్‌డిఒ వీణాదేవి ఇతర జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కేరళపై కక్షపూరిత వైఖరి తగదు

ప్రజాశక్తి - కాకినాడ

ధర్నాలో మాట్లాడుతున్న రైతు సంఘం అధ్యక్షులు తిరుమలశెట్టి నాగేశ్వరరావవు

కేరళ రాష్ట్రంలో కేంద్ర ప్రభుత్వం పక్షపాత వైఖరితో వ్యవహరిస్తుందని ప్రజా సంఘాల నాయకులు అన్నారు. బుధవారం కలెక్టరేట్ వద్ద రైతు, వ్యవసాయ కార్మిక, కౌలు రైతు సంఘాల ఆధ్వర్యంలో ధర్నా జరిగింది. ఈ ధర్నాలో సిఐటియు జిల్లా అధ్యక్షులు దువ్వా శేషబాబ్జి, ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి తోకల ప్రసాద్, సామాజిక వేత్త దూసర్లపూడి రమణరాజు, జెవివి నాయకులు డాక్టర్ సూర్యనారాయణ, ఐద్వా రాష్ట్ర నాయకురాలు సిహెచ్.రమణి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్య దర్శులు తిరుమలశెట్టి నాగేశ్వరరావు, గుర్రాల అప్పారెడ్డి, ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు టేకుమూడి ఈశ్వరరావు, కెఎస్.శ్రీనివాస్, ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎం.రాజశేఖర్, వల్లు రాజబాబు మాట్లాడారు. నూరు శాతం అక్షరాస్యత, ఆయు:ప్రమాణంలో దేశంలో మొదటి స్థానం, మహిళా సాధికారత, విద్యా, వైద్య రంగాల్లో విప్లవా త్మక మార్పులు, స్థానిక సంస్థలను బలోపేతం చేయడంలో దేశంలో అగ్ర స్థానంలో పయనిస్తున్న రాష్ట్రం కేరళ అని, స్వామినాథన్ కమిటీ సిఫార్సుల అమలు చేస్తూ రైతుకు, కనీస వేతనం అమలు చేస్తూ కార్మికులకు, వ్యవసాయ కూలీలకు మేలు చేస్తున్న సిపిఎం నాయకత్వంలోని వామపక్ష ప్రభుత్వం పట్ల కేంద్రంలో బిజెపి ప్రభుత్వం పక్షపాత వైఖరితో వ్యవహరిస్తుందని దుయ్యబట్టారు. రాష్ట్రానికి రావాల్సి న నిధులను విడుదల చేయకుండా, రాష్ట్రానికి అప్పులు పుట్టకుండా చేస్తూ ఇబ్బందులకు గురిచేస్తుం దన్నారు. దేశ ప్రజలపై మతోన్మాదాన్ని రుద్ది అన్ని రాష్ట్రాల్లో అధికారంలోకి వచ్చేందుకు కుట్రలు పన్ను తున్న బిజెపి కేరళ వామపక్ష ప్రభుత్వం కొరకరాని కొయ్యగా మారిందని అన్నారు. అందుకే ఆ రాష్ట్రంపై కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కక్షగట్టి లక్ష కోట్లకు పైగా రావాల్సిన న్యాయమైన వాటా ఇవ్వకుండా ఆ రాష్ట్ర అభివృద్ధిని అస్థిర పరిచేందుకు కుట్రలు సాగిస్తుందన్నారు. దేశాన్నే కలిచివేసిన వయనాడ్ వరదల్లో వందలాది మంది మరణించినా కేరళ రాష్ట్రా నికి కేంద్రం ఒక్క రూపాయి సహాయం చేయలే దన్నారు. కేరళ పట్లే కాక దేశంలోని బిజెపి యేతర రాష్ట్ర ప్రభుత్వాల పట్ల ఇలాగే వ్యవహరిస్తుందని, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి కూడా ప్రత్యేక హోదా ఇవ్వ కుండా మోసం చేస్తుందని నాయకులు విమర్శిం చారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు కె.సింహాచలం, లాజర్, సిఐటియు జిల్లా నాయకులు పలివెల వీరబాబు, రైతు సంఘం నాయకులు కొండ, గుర్రాల శ్రీనివాస్, నారాయణ రెడ్డి, కౌలు రైతు సంఘం నాయకులు సంతోష్, ఎంకెఎంకెఎస్ నాయకులు యు.సత్యనారాయణ, ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు శ్రీకాంత్ సిద్ధు, ఐద్వా నాయకురాలు భూలక్ష్మి, భవాని పాల్గొన్నారు.

కొండబాబును సత్కరిస్తున్న టిడిపి నాయకులు

కొండబాబుకు సత్కారం

ప్రజాశక్తి-గోకవరం

రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ కొత్త వెంకటేశ్వరరావు (కొండబాబు)ను గోకవరం మండల టిడిపి అధ్యక్షులు మంగరౌతు రామకృష్ణ, జిల్లా వాణిజ్య విభాగం అధికార ప్రతినిధి బత్తుల సత్తిబాబు, రాష్ట్ర తెలుగు రైతు ఉపాధ్యక్షులు అడప భరత్ బాబు, రాష్ట్ర తెలుగు రైతు అధికార ప్రతినిధి ఉంగరాల రాము జగ్గంపేట టిడిపి కార్యాలయంలో బుధవారం శాలువా, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎంఎల్ఎ జ్యోతుల నెహ్రూ ఆశీస్సులతో రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ గా నియమితులైన కొండబాబును ఘనంగా సత్కరించుకున్నామన్నారు. ఆయన గతంలో అన్నవరం ట్రస్ట్ బోర్డు సభ్యులుగా సేవలందించారన్నారు. రానున్న కాలంలో మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు. పురం శెట్టి శివాజీ, సాలాపు నలమహారాజు, నాగులపాటి నారాయణ కుమార్, కోట సూరిబాబు, పిల్ల అర్జున్ సారధి, మండిగ గంగాధర్ పాల్గొన్నారు

గోతులు పూడ్చండి మహాప్రభో...

ప్రజాశక్తి - చాగల్లు

మండంలోని రహదారులపై పడిన గోతులను పూడ్చాలని ప్రయాణికులు మొరపెట్టుకుంటున్నారు. నిడదవోలు నుంచి పంగిడి రోడ్డు గోతులతో ప్రమాదకరంగా మారిందన్నారు. ఎక్కడ చూసినా గోతులు దర్శనమిస్తున్నాయన్నారు. సిసి రోడ్లు, తారు రోడ్లు కలిసిన ప్రాంతాల్లో ఈ గోతులు ఎక్కువగా ఉన్నాయన్నారు. గోతుల్లో పడి వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారని తెలిపారు. వాహనాలు తరచూ మరమ్మతులకు గురవుతున్నాయని పలువురు తెలిపారు. వెంటనే గోతులను పూడ్చాలని వారు కోరుతున్నారు.

వీవర్స్ సొసైటీని సందర్శించిన కేంద్ర బృందం

ప్రజాశక్తి - పెద్దాపురం

చీరలను పరిశీలిస్తున్న కేంద్ర బృందం ప్రతినిధులు

పట్టణంలో చేనేత సహకార సంఘాన్ని బుధవారం కేంద్ర బృందం సందర్శించింది. వన్ డిస్ట్రిక్ట్-వన్ ప్రోడక్ట్ స్కీంలో దరఖాస్తు చేసుకున్న చేనేత సహకార సంఘాల పరిశీలనలో భాగంగా ఢిల్లీకి చెందిన కేంద్ర వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖ డిపిఐఐటి విభాగానికి చెందిన అస్మిన్ కౌర్, నిషికేత్ మిట్టల్, చేనేత జౌళి శాఖ అధికారుల బృందం సొసైటీని సందర్శించి పరిశీలించారు. చేనేత సొసైటీ ద్వారా ఉత్పత్తి జరుగుతున్న వస్త్రాలను, సొసైటీ వనరులు, టర్నోవర్, సాధించిన విజయాలు, ఇతర ప్రాంతాలకు వస్త్రాల అమ్మకాలు తదితర అంశాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ప్రస్తుత చేనేత రంగంలో ఆర్థిక స్థితిగతులు, పొందుతున్న వేతనాలు, యువత చేనేత రంగంలోకి రాకపోవడానికి కారణాలను కార్మికులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ వన్ డిస్ట్రిక్ట్ వన్ ప్రోడక్ట్ కు ఈ సొసైటీ ఎంపిక అయితే అంతర్జాతీయంగా బ్రాండ్ క్రియేట్ చేసి వస్త్ర ఉత్పత్తులు జరిపేందుకు ప్రోత్సాహం లభిస్తుందన్నారు. ఇండియన్ ఇంటర్నేషనల్ ట్రేడ్ పెయిర్(ఐఐటిఎఫ్) వంటి వాటిల్లో ఈ చేనేత ఉత్పత్తులు అమ్మకాలకు వీలు కల్పించబడు తుందన్నారు. ఈ సొసైటీ పరిధిలోని చేనేత కార్మికులకు చేనేతలోని ఆధునిక, సాంకేతిక పరిజ్ఞానంపై శిక్షణ ఇస్తాం న్నారు. ఈ కార్యక్రమంలో చేనేత జౌళి శాఖ రీజనల్ డైరెక్టర్ ధనంజయరావు, జిల్లా అసిస్టెంట్ డైరెక్టర్ పెద్దిరాజు, చేనేత సహకార సంఘం పర్సన్ ఇన్‌ఛార్జ్ ఫణిబాబు, డెవలప్ మెంట్ ఆఫీసర్లు చేతన, గణేష్, సొసైటీ మేనేజర్ తూతిక చంద్రశేఖర్, గాంధీ చేనేత సొసైటీ మేనేజర్ దొరరాజు, తూతిక సత్యనారాయణ, కోటి మల్లిబాబు, చప్పటి సత్యనా రాయణ, బొండపల్లి బాబురావు, కొమ్మన వెంకటరమణ, ఓం నమశ్శివాయ, మధుబాబు, పురుషోత్తం పాల్గొన్నారు.

ప్రమాద భరితంగా మ్యాన్ హోల్...

ప్రజాశక్తి- కడియం

కడియం గ్రామంలో గిరజాల వారి వీధిలో రోడ్డు మధ్యలో మ్యాన్‌హోల్ ప్రమాద భరితంగా మారింది. ఈ రోడ్డులో మధ్యగా డ్రైనేజీ ఉంది. డ్రైనేజీని శు భ్రం చేయడానికి ఈ మ్యాన్ హోల్‌ను ఉపయోగిస్తున్నారు. ఇది సక్రమంగా లేకపోవడంతో ప్రమాద భరితంగా మారింది. సమీపంలోనే కళ్యాణ మండపం ఉండడంతో కొన్ని సందర్భాల్లో పలువురు దీనిపై నుంచే రాకపోకలు సాగిస్తుంటారు. తెలియని వారు ఈ రోడ్డుగుండా ప్రయాణిస్తే మ్యాన్‌హోల్‌లో పడి ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉంది. పంచాయతీ సిబ్బంది స్పందించి దీన్ని సరిచేయాలని స్థానికులు కోరుతున్నారు.

21న జడ్‌పి సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి - కాకినాడ

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 21వ తేదీన నిర్వహించనున్నట్లు జడ్‌పి సిఇఒ వివిఎస్.లక్ష్మణరావు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. స్థాయి సంఘాలు 1 నుంచి 7 వరకూ జరుగుతాయని వెల్లడించారు. పంచాయతీరాజ్ చట్టంలోని నిబం ధనలకు లోబడి జడ్‌పి సమావేశం, స్థాయీ సంఘాల సమావేశం జరుగుతుందన్నారు. కావున ప్రజా ప్రతినిధులు, సంబంధిత స్థాయి సంఘాల సభ్యులు, అధికారులు విధిగా 21వ తేదీ ఉదయం 10.30 గంటలకు సకాలంలో హాజరుకావాలని ఆయన కోరారు.

IN THE HON'BLE COURT OF
THE VI ADDL. CIVIL JUDGE
(SENIOR DIVISION)
AT : VISAKHAPATNAM
O.S.419/2021

Between:
Smt. Pinisetti Rajeswari & Smt. Raparthi Pentamma, Rep. by G.P.A. Holder Sri P. Chandra Mohan ...Plaintiff
And
Smt. Gondesh Vijaya & 6 others ...Defendants

SUIT SUMMONS

To, **Defendant No.4:**
Sri Bonthu Bramananda Rao, S/o. Tatayya, Hindu, aged 54 years, R/at Kothumeraka Village, Pasalapudi, (East Godavari District) Presently Dr. B.R.Ambedkar Konaseema Dist.

Please take notice that the above named plaintiff has instituted the above suit against you for permanent injunction restraining the defendants, their men, agents and henchmen etc., whosoever acts on their behalf from ever interfering with their peaceful possession and enjoyment of the plaint schedule property in any manner whatsoever and the suit stands posted to **27-12-2024** for your appearance. You are hereby summoned to appear before the Hon'ble Court either in person or through duly instructed Advocate on **27-12-2024** at **10:30 A.M** in the above Court to answer all material questions, failing which the suit will be heard and determined in your absence, exparte as per law.

(By Order of the Hon'ble Court)
SURAMPUDI SRINIVASA RAO,
Advocate
Visakhapatnam, Cell: 9396444445

మద్దతు తెలుపుతున్న కాంగ్రెస్ శ్రేణులు

జీడిపిక్కల కార్మికులకు పలువురి మద్దతు

ప్రజాశక్తి - ఏలేశ్వరం

మూసివేసిన చిన్నింపేట జీడి పిక్కల ఫ్యాక్టరీని తెరిపించాలని డిమాండ్ చేస్తూ కార్మికులు చేపట్టిన ఆందోళనకు పలువురు మద్దతు తెలిపారు. బుధవారం ఫ్యాక్టరీ వద్ద ఆందోళన చేస్తున్న కార్మికులను ఎఐసిసిటియు రాష్ట్ర కార్యదర్శి గొడుగు సత్య నారాయణ, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు మాదేపల్లి సత్యానందరావు కలిసి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లా డుతూ కూటమి ప్రభుత్వం కొత్త పరిశ్రమలు తీసుకొచ్చి లక్షలాది మందికి ఉపాధి కల్పి స్తామని గొప్పలు చెప్పుకోవడం మాని మూసి వేసిన ఫ్యాక్టరీలను తెరిపించేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్మికుల ఐక్య పోరాటాల ద్వారానే సమస్య పరిష్కారం అవుతుందన్నారు. ప్రభుత్వం, యాజమాన్యం కార్మికులతో వెంటనే చర్చించి తగు పరిష్కా రం చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా వర్కింగ్ కమిటీ సభ్యులు రొంగల ఈశ్వరరావు, ప్రగతిశీల మహిళా సంఘం నాయకురాలు శీలం అప్పలరాజు, కాంగ్రెస్ పార్టీ నాయకులు కొప్పన కోటేశ్వర రావు, ధర్నాలకోట శ్రీను, మొయ్యేటి సూర్య ప్రకాశరావు, కార్మికులు ఎ.వీరబాబు, చక్రధర్, గోవింద్, కృష్ణారావు, ధర్మాజీ, జయలక్ష్మి, భాగ్యలక్ష్మి, చంటి సత్య పాల్గొన్నారు.

గర్భిణులకు అన్నదానం

పెద్దాపురం : మన పెద్దాపురం గ్రూపు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మాతృత్వం కార్యక్రమంలో భాగంగా బుధవారం 150 మంది గర్భినులకు అన్నదానాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రూపు అడ్మిన్ పెదిరెడ్డి నరేష్ మాట్లాడుతూ కాజా నరసింహమూర్తి శత జయంతి వేడుకల్లో భాగంగా ఆయన కుమారుడు కాజా రాజేశ్వరరావు సాయంతో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ చౌదరి, గ్రూపు సభ్యులు ఆనంద్, ప్రశాంత్, నవీన్ నాని, రాజేష్‌కుమార్, రత్నం, జయశ్రీ, లక్ష్మి పాల్గొన్నారు.

ఆటో యూనియన్ అధ్యక్షునిగా బాలాజీ

ప్రజాశక్తి - కోరుకొండ

కోరుకొండ శ్రీలక్ష్మీ నరసింహ ప్యాసింజర్స్ ఆటో యూనియన్ అధ్యక్షునిగా పెంటకోట బాలాజీ ఎన్నికయ్యారు. మంగళవారం నిర్వహించిన ఎన్నికల్లో లోవప్రసాద్‌పై 131ఓట్ల మెజారిటీతో బాలాజీ గెలుపొందారు.రిటైర్డ్ ఉపాధ్యాయులు, పోలీసుల ఆధ్వర్యంలో ఎన్నికలు నిర్వహించారు. సుమారు 500 ఓట్లకు 350 ఓట్లు పోలయ్యాయి. యూనియన్ ఉపాధ్యక్షులుగా టి.త్రిమూర్తులు, సెక్రటరీగా టి.రాజారత్నం, ట్రెజరర్‌గా యల్లపు అప్పలరాజు ఎన్నికయ్యారు.

యూనియన్ అధ్యక్షునిగా ఎన్నికయిన బాలాజిని అభినందిస్తున్న డ్రైవర్లు

రూ.1.50 కోట్లతో అభివృద్ధి పనులు

ప్రజాశక్తి - గండేపల్లి

మండలంలోని మురారి గ్రామంలో రూ.1.50 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టినట్లు టిడిపి జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ అన్నారు. బుధవారం గ్రామంలో చేపట్టిన పలు అభివృద్ధి పనులను ఆయన పరిశీలించారు. ఈ సంద్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమాన్ని సమపాళ్లలో నడిపించే కూటమి ప్రభుత్వం ఏర్పడిందని అన్నారు. జగ్గంపేట నియోజకవర్గంలో ఎంఎల్ఎ జ్యోతుల నెహ్రూ సారధ్యంలో అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయని తెలిపారు. ఒక్క మురారి గ్రామంలోనే రూ.1.50 కోట్లతో సిసిరోడ్డు, డ్రెయిన్ల నిర్మాణం జరుగుతున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో పోతుల మోహనరావు, కోర్పు సాయితేజ, పరిమిబాబు, కందుల చిట్టిబాబు, ఉప సర్పంచ్ జాస్తి వసంత్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మహా గర్జన విజయవంతానికి కృషి

ప్రజాశక్తి - తాళ్లరేవు

కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న నాయకులు

ఈ నెల 15న గుంటూరులో జరగనున్న మాలల మహాగర్జన విజయవంతం చేయ డానికి కృషి చేయాలని మండల దళిత యునైటెడ్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యదర్శి దున్న సుబ్రహ్మణ్యం పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక అంబేద్కర్ భవన్ వద్ద మాలల మహా గర్జన చలో గుంటూరు కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాలల ఐక్యతను చాటేందుకు నిర్వహిస్తున్న మహాగర్జన సభకు మండల వ్యాప్తంగా మాల సామాజికవర్గానికి చెందిన యువకులు, మహిళలు, మేధావులు పెద్దఎత్తున తరలిరావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎలిపే నాగేశ్వరరావు, పోలేకుర్రు సర్పంచ్ వెంటపల్లి నూకరాజు, మాజీ సర్పంచ్ దడాల బుజ్జిబాబు, దడాల జగదీశ్వరరావు, కాశి లక్ష్మణస్వామి, జక్కల ప్రసాద్‌బాబు, దున్న మురళీ, రేవు నాగేశ్వరరావు, దాసరి వేణుగోపాల్, గోడి భాస్కరరావు, దుప్పి అదృష్టదీపుడు పాల్గొన్నారు.

N.M.E.S COLLEGE OF EDUCATION
(Approved by NCTE & Affiliated to Adikavi Nannaya University, Rajahmundry)
Ramesampeta, Anuru Road, Peddapuram Mandal Kakinada Disrict 533437 A.P.
Phone : 9440402405 Website : www.nmecepdp.org

ADMISSION IN TO B.Ed "B" CATEGORY & "A" CATEGORY SPOT SEATS

Applications are invited from the eligible candidates for B.Ed. course under management Quota & Spot admission for the academic year 2024-25.
College Status : Non Minority
Intake : 50
College Vacancy Position
Categegory A left over seats (Spot) : 38+5 (EWS)
Category B Seats Management Quota : 12
Eligibility : Bachelor Degree or P.G. with 50% Marks for OC, and 40% for BC, SC, ST with or without Edcet-2023, Xerox copies SSC, Intermediate Marks, Degree or P.G. Marks list, O.D'S, Study certificates (from 10th to Degree) and caste certificate, T.C. should be submitted to the college office by personally between 10A.M. to 4 P.M. on or before 13-12-2024

Cell : 9849063618
9440402405

Smt. Kanikella Manjula, M.Sc., M.Ed
Secretary & Correspondent
Date : 07-12-2024

గ్రావెల్‌ను తరలిస్తున్న వాహనం

అక్రమంగా గ్రావెల్ తరలింపు

ప్రజాశక్తి - గొల్లప్రోలు

మండలంలోని చెందుర్తి గ్రామంలో గత ఐదు రోజులుగా అక్రమ గ్రావెల్ తవ్వకాలు జోరుగా సాగుతు న్నాయి. డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ క్యాంప్ కార్యాలయం వెనుక ఈ అక్రమ దందా సాగుతోంది. పుష్కర కాలువ పోలవరం కాలువ గట్టు మధ్యలో ఉన్న గ్రావెల్‌ను అక్రమార్కులు తరలించుకుపోతున్నారు. రాత్రి, పగలు అని తేడా లేకుండా గ్రావెల్‌ను తరలించుకుపోతున్నా సంబంధిత రెవెన్యూ అధికారులు చూసి చూడనట్లు వ్యవహరించడంపై పలు ఆరోపణలు విన్పిస్తున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు గ్రావెల్ అక్రమ దందాను అడ్డుకట్ట వేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఒరిజినల్ దస్తావేజులు పోయినవి

నా క్లయింట్ సరిపెల్ల వెంకట సూర్యనారాయణ రాజు అనే సందీప్ S/oవెంకట సుబ్బరాజు, డో.నెం:2-15, పోతుకుర్రు గ్రామం , అయినవిల్లి మండలం , డాక్టర్ బి.ఆర్ .అంబేద్కర్ కోనసీమ జిల్లా వారి సంజాయిషీ యావన్మందికి తెలియజేయునది ఏమనగా నా క్లయింట్ పేరున పోతుకుర్రులోఉన్న వ్యవసాయ భూమి సంబంధించిన **09-06-2016** వ తేదీన ముమ్మిడివరం ఎస్.ఆర్.ఓ లో రిజిస్టర్ కాబడిన ఒరిజినల్ గిఫ్ట్ సెటిల్మెంట్ డీడ్ దస్తావేజులు పడిపోయినవి. 1) డాక్యుమెంట్ నెంబర్ 3534/2016 రి.సర్వే నెం 119 లో ఏ 2.20 సెంట్లు 2) డాక్యుమెంట్ నెంబర్ 3535/2016 రి.సర్వే నెం 138/17 లో ఏ 0.46 సెంట్లు,139/1 లో ఏ 1.58 సెంట్లు వెరసి ఏ 2.04 సెంట్లు కు సంబంధించిన ఒరిజినల్ గిఫ్ట్ సెటిల్మెంట్ డీడ్ దస్తావేజులు పడిపోయినవి. **23-09-2024** తేదీన మా క్లయింట్ పోతుకుర్రు వారి ఇంటి వద్ద నుండి అయినవిల్లికి ఆటోలో ప్రయాణిస్తుండగా మార్గ మధ్యలో దస్తావేజులు పడిపోయినవి. సదరు రెండు ఒరిజినల్ దస్తావేజులు ఎంత వెతికినప్పటికీ దొరకలేదు. కాబట్టి మా క్లయింట్ కు సంబంధించిన ఒరిజినల్ దస్తావేజులు ఎవరికైనా దొరికిన యెడల మాకు అందజేయవలసిందిగా కోరుచున్నాను.

ఇట్లు
టి. శాంతి కమల
న్యాయవాది,అమలాపురం
సెల్ 70136 65313

మహారాజశ్రీ ప్రిన్సిపల్ జిల్లా జడ్జి వారి కోర్టు, రాజమహేంద్రవరం
M.V.O.P. No. 57/2019

Between:
Palli Sruti ...*Petitioner*
AND
S.Srinivasa Rao and Others
...*Respondents*

R-4: Bajaj Allianz General Insurance Co. Ltd., Rep. by its Manager, 3rd Floor, Peejay Plaza, VIP Road, Siripuram, Opp: Hotel Tycoon, Visakhapatnam.

పై నెంబరు పిటిషన్‌లో 4వ రెస్పాండెంటు ప్రతివాది అయిన మీకు కోర్టు ద్వారా ఎన్నిసార్లు సమన్లు/ నోటీసులు పంపినా మీరు వాటిని తీసుకోకుండా ఉద్దేశ్యపూర్వకంగా త్రిప్పి వేయుచున్నారు. కావున ది. **24-12-2024** **సం॥రం తేదీ ఉదయం 10.30 ని॥లకు** మీరు స్వయంగా గాని, లేదా ప్లీడరు ద్వారా గాని పై కోర్టు వారి ఎదుట హాజరు అయ్యి సదరు పై పిటిషన్‌లో మీ ఆక్షేపణలను తెలుపుకొనవలెను. లేనియెడల సదరు పిటిషన్‌ను మీకు పరోక్షముగా శ్రీ కోర్టు వారు తీర్మానించెదరు.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
ఎస్.జి.శంకర్
రాజమండ్రి బి.జె.ఎస్.దివాకర్
11-11-24 అడ్వకేట్స్, రాజమండ్రి

మహారాజశ్రీ 8వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టు, రాజమహేంద్రవరం
M.V.O.P.No.449/2021

Between:-
Yedakula Rama Krishna
And
1. Kandrapu Naga Satti Babu,And Others
...Respondents

R1. Kandrapu Naga Sathi babu, S/o.Demudu, Hindu, Aged 41 years, Driver of the Lorry crime vehicle bearing No. AP 31 TB 1177, Y. B. Patnam Village, Y.B. Agraharam post, (Yerakabhupati Agra haram) H/o. Gannavaram Panchayathi, Nathayaram(M), Vizag Dt., 531 115. VJCJ
...1St Respondents

పై నంబరు పిటిషన్ 1వ రెస్పాండెంటు అయిన మీకు కోర్టు ద్వారా ఎన్నిసార్లు సమన్లు/నోటీసులు పంపినా మీరు వాటిని తీసుకోకుండ ఉద్దేశ్యపూర్వకంగా త్రిప్పి వేయుచున్నారు. కావున **ది.03-01-2025** సం॥రం తేదీ ఉదయం **10.30** ని॥లకు మీరు స్వయంగా గాని లేదా ప్లీడరు ద్వారా గాని పైకోర్టు వారి ఎదుట హాజరు అయ్యి సదరు పై పిటిషన్‌లో మీ ఆక్షేపణలను తెలుపుకొనవలెను. లేని యెడల సదరు పిటిషన్ మీకు పరోక్షముగా శ్రీ కోర్టు వారు తీర్మానించెదరు.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
G.సతీష్‌కుమార్
రాజమండ్రి G.అంబిక ప్రసాద్
11-12-2024 అడ్వకేట్, రాజమండ్రి